# పరాయి సిరా

## అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణీ చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# స్త్రీ గౌరవం
# {కేమరూన్ కథ కథకి స్వేచ్ఛానువాదం}
## రచన: డిపితా క్వా

**రాత్రి పదకొండు దాటింది**. నేను మంచం మీద మోకాళ్ళ మీద కూర్చుని చెదపట్టిన కిటికీలోంచి బయటకి చూడసాగాను. మా అమ్మ ఇంకా వరండాలోనే కూర్చుని నాకన్నా మూడేళ్ళు పెద్దదైన అక్క నూటో కోసం ఎదురుచూస్తోంది. నూటో, అమ్మ మధ్య ఎప్పుడూ పోట్లాటలే. వారిద్దరినీ ఏదో వ్యతిరేక శక్తి దూరంగా లాగుతోందని నాకు అనిపిస్తూంటుంది.

పద్దెనిమిదేళ్ళ మా అక్క దాదాపు ప్రతీ రాత్రి ఇంత ఆలస్యంగా బయట ఏం చేస్తుందో నాకు తెలీదు. నేను దోమల సంగీతం నించి కాపాడుకోడానికి చెవులని చేతులతో కప్పుకుని మా నాన్న గురించి ఆలోచించాను. ఐదేళ్ళ క్రితం నా పదో ఏట ఆయన పోయారు. అమ్మ తర్వాత నన్ను, అక్కని కేథీ అత్త దగ్గర వదిలి వెళ్ళిపోయింది. నాలుగేళ్ళపాటు అత్త మియాండో వంటకం చేసి అమ్ముతూ తద్వారా తనకి వచ్చే తక్కువ ఆదాయంతోనే మా ఇద్దర్నీ పోషించింది. ఆ నాలుగేళ్ళు నేను ఆనందంగానే ఉన్నాను. వెన్నెల రాత్రుళ్ళు చల్లటిగాలి వీస్తూంటే మేం ముగ్గురం గుండ్రంగా కూర్చుని ఇగుసీ పప్పులని కొట్టుకుని తినేవాళ్ళం. ఆవిడ మాకు స్త్రీ గౌరవం గురించి చెప్పేది. మేం అది శ్రద్ధగా వినేవాళ్ళం. మా అత్త దగ్గర ఉన్నప్పుడు నూటో ఎన్నడూ బయటకి వెళ్ళేది కాదు.

కాని క్రితం సంవత్సరం అమ్మ వచ్చి మమ్మల్ని తీసుకెళ్ళి ఓ రెండు గదుల ఇంట్లో ఉంచింది. కారణం మా నాన్నకి వారసత్వంగా వచ్చిన గ్రామ శివార్లలోని ఇల్లు గడ్డి పెరిగి, పాడుబడిపోయి దాదాపు కూలిపోయే పరిస్థితికి వచ్చింది.

అకస్మాత్తుగా మా అమ్మ మాటలు పెద్దగా వినిపించడంతో నా ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

"ఎక్కడికి వెళ్ళావు? ఎందుకింత ఆలస్యంగా వస్తున్నావు?" మా అమ్మ అరిచింది.

నేను కిటికీలోంచి రహస్యంగా చూడసాగాను. మా అక్క అమ్మని పక్కకి నెట్టి లోపలకి రాబోతే, అమ్మ నూటో చేతిని బలంగా పట్టుకుని ఆపింది. నేను భయంగా చూసాను.

"ఆగక్కడ. నీతోనే మాట్లాడేది. మన ముకుంద గ్రామంలో రాత్రి నీ వయసు పిల్లలు ఎవరింట్లో వారు నిద్రపోతూంటే, నువ్వు దెయ్యంలా ఎక్కడికి వెళ్ళొస్తున్నావు?"

"నేను ఇంట్లో ఉంటే ఏం? బయటకి వెళ్ళి వస్తే ఏం?" నూటో తన చేతిని లాక్కుని కోపంగా అడిగింది.

మా అక్క కళ్ళల్లోని ద్వేషభావాన్ని చూడగానే కోపం వచ్చిన పిల్లిలా తిరగబడటానికి సిద్ధంగా ఉందని నాకు అర్థమైంది. తిరగబడటానికి మునుపు అనేకసార్లు ఆ కళ్ళని నేను గమనించాను.

మా అమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. ఆవిడ మండే హృదయం మీద చల్లటి నీరు కుమ్మరించినట్లుగా నాకు అనిపించింది. బహుశ అమ్మ వృద్ధురాలవుతోంది అనుకున్నాను. ఐదేళ్ళ క్రితం తన నలభై ఒకటో ఏట ఐతే నూటోని చెంపదెబ్బ కొట్టి తర్వాత ప్రశ్నించేది. కాని ఇప్పుడు గొంతు తగ్గించి అడిగింది.

"నా బంగారం! నువ్వు ఓ మగాడి గది నించి, ఇంకో మగాడి గదికి ఒంటరిగా తిరుగుతూంటే అది నీకు అగౌరవాన్ని, నాశనాన్ని తెచ్చిపెడుతుంది. ఈ ప్రపంచం అనేక రోగాల మయంగా మారింది."

"ఇది నా జీవితం. నా ఇష్టం వచ్చినట్లు ఉండనీ. నువ్వు నీ అండర్‌వేర్‌ని మార్చినట్లుగా మగాళ్ళని మార్చినప్పుడు, ఇద్దరు లం...కి తల్లివైనప్పుడు ఎవరి సలహాని పాటించావు? పరాయి ఆడదాని భర్త నీ పక్కలో మరణించకపోతే నువ్వు మళ్ళీ ఆంటీ ఇంటికి వచ్చి మమ్మల్ని తీసుకువచ్చేదానివేనా? నీ కపటబుద్ధితో ఇలా నాకు హితబోధ చేసేదానివా?" నూటో కోపంగా అడిగింది.

అది నిజమే. ఏడాది క్రితం ఇవోలో మా అమ్మ పక్కలో మరణించాకే మా అమ్మ ముకుంద గ్రామానికి తిరిగి వచ్చింది. ఈ ప్రశ్న అడిగి నూటో పాము తోక మీద కాలు వేసింది.

అమ్మ నూటోని గట్టిగా కొట్టిన చెంప దెబ్బ చప్పుడు నాకు వినిపించింది. నూటో దానికి స్పందించింది. మా అమ్మ మీద పడి గీరుతూ కొట్టసాగింది. మరుక్షణం అమ్మ కుడి చంక కింద నూటో తల చిక్కుకుంది. అమ్మ కొట్టే దెబ్బల నించి తప్పించుకోడానికి నూటో అమ్మని రక్కడం అధికమైంది. అమ్మ బ్లౌజ్‌ని పట్టుకుని బలంగా చింపింది. బయటపడ్డ నా తల్లి వక్షోజాన్ని నూటో గట్టిగా కొరికింది.

తక్షణం అమ్మ, నేను ఏకకంఠంతో గట్టిగా అరిచాం. నేను పిగిలిపోయిన నైటీతోనే బయటకి పరిగెత్తాను. అమ్మ రక్తం కారే తన వక్షోజాన్ని అదుముకుంటే, చేతివేళ్ళ సందుల్లోంచి రక్తం కారడం నాకు కనిపించింది. ఎర్రటి ఉమ్మి నోటిని చేత్తో తుడుచుకుంటూ నూటో చీకట్లోకి వెనక్కి తిరిగి పరిగెత్తింది. ఆ గొడవకి చుట్టుపక్కల వారంతా నిద్రలేచి బయటకి వచ్చారు. ఎవరి ఊరడింపులూ అమ్మని శాంతింపచేయలేదు.

అదే రోడ్లో స్కూల్ కాంపౌండ్‌కి ఎదురింట్లో ఉండే నర్స్ వచ్చి అమ్మ గాయానికి డ్రెసింగ్ చేసి కొన్ని మందులు ఇచ్చింది. కానీ అమ్మ నిద్రపట్టేదాకా నూటోని శపిస్తూనే ఉంది.

"చూస్తూండు. నీ జీవితం మొత్తం దురదృష్టం, దుఃఖం నిన్ను వెంటాడుతాయి."

"ఏమిటా మాటలు? వాటిని వెనక్కి తీసుకోండి. నూటో జీవించి ఉన్నంతకాలం మీ అమ్మాయే. ఆమెకి ఈ శాపాల వల్ల శాంతి ఉండదు. నేనే కనుక ఆ అమ్మాయి తల్లినై ఉంటే..." నర్స్ కోప్పడింది.

"తీసుకోను. ఎక్కడికి వెళ్ళినా తెనెపట్టులోని ఈగల్లా ఆమె తల మీద దుఃఖం వాలుతూంటుంది."

రాత్రి నిద్రపట్టేదాకా అమ్మ శాపాలు కొనసాగాయి.

అక్కయ్య తిరిగి రానేలేదు.

మూడు రోజుల తర్వాత కేథీ అత్త వచ్చింది.

"జరిగింది విన్నాక నీకు ఎలా ఉందో తెలుసుకుందామని వచ్చాను. నూటో ఇంకా తిరిగి రాలేదా?"

"లేదు. రాత్రి నేను నిద్రపోయాక మళ్ళీ వచ్చి నా సూట్‌కేస్‌లో తన బట్టలు సర్దుకుని ఆ రాత్రే వెళ్ళిపోయింది. మళ్ళీ కనపడలేదు" అమ్మ చెప్పింది.

"పెండా! వచ్చి నా పక్కన కూర్చో. నేను చెప్పేది నువ్వు జాగ్రత్తగా విను..." అత్త తన పక్కన స్టూల్ మీద కూర్చోమన్నట్లుగా తట్టింది.

నేను ఆమె పక్కన కుర్చున్నాక మా అమ్మ వైపు చూస్తూ చెప్పింది.

"నేను ఎక్కువ మాట్లాడతానని అంతా అంటారు. అందుకని చాలా కాలంగా మాటలు తగ్గించేసాను .కానీ నా మనసులోది మీ ముందు ఉంచకుండా ఈ రోజు మరణిస్తే తర్వాతి ప్రపంచంలో నాకు శాంతి ఉండదు. సలహా ఇవ్వడం వల్ల ఎవరికైనా ఇంతదాకా పళ్ళు ఊడాయా?" కోలా నట్స్‌ని తింటూ తను చెప్పేది మొదలు పెట్టింది.

"ఎండేవ్! అన్ని దురదృష్టాలకి కారణం నువ్వే. యవ్వనం అనేది ఎన్నటికీ ఎండిపోని బావిలాంటిది అనుకోకు. నువ్వు చాలా నీచమైన జీవితాన్ని గడిపావని గుర్తు చేస్తున్నాను. అది నీ కూతుర్ని చెరుస్తుందని నువ్వు అనుకోలేదు. నీ స్వంత తల్లి నీ పాడు జీవితాన్ని ఆపమని చెపితే, నువ్వామెని పిచ్చి కుక్కలా కొట్టి బయటకి లాగేసావు. నీలాంటి అందమైన అమ్మాయికి ఆమెలాంటి కుంటిది జన్మని ఇవ్వలేదని దెప్పిపొడిచావు. నువ్వు ఇంటిని వదిలిపెట్టి వెళ్ళాక ఆవిడ తీవ్ర మానసిక బాధతో అలమటించి మరణించింది..."

"ఇక దయచేసి ఆపు కేథీ" అమ్మ అరిచింది.

"ఆపను."

"నూటో నన్ను చంపి వెళ్ళినా బావుండేది" అమ్మ బాధగా గొణిగింది.

ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు కారడం చూసాను. అది నాకు ఎంతో అరుదైన దృశ్యం.

"నూటో నిన్నెందుకు చంపలేదంటే నువ్వు మీ అమ్మని చంపలేదు కాబట్టి. నువ్వు మీ అమ్మకి పడ్డ ఋణాన్ని నూటో నీకు తీరుస్తోంది. ఈ చక్రం ఇలాగే కొనసాగుతుంది. నువ్వు మీ అమ్మకి ఋణపడటం, నూటో నీకు ఋణపడటం, రేపు నూటో కూతురు కూడా ఇలాగే నూటోకి ఋణపడుతుంది. నీకన్నా ముందు అనేకమందిలా నువ్వు కూడా భయంకరమైన బాధాచక్రలో, అంతులేని శాపాల గొలుసులో ఇరుక్కున్నావు. నువ్వు ఇంకో ఊరుకి వెళ్ళి నీ ప్రియుడితో ఉన్నప్పుడు మీ అమ్మ మరణించింది. ఆవిడ శవాన్ని వేరేవాళ్ళు పాతిపెట్టారు. నువ్వు మీ అమ్మని బాగా బాధపెట్టావు. నూటో ఈ రోజు తను బేస్టర్డ్ అనుకుంటూంటే అది నిజమే కదా? నా తమ్ముడు జీవించి ఉన్నప్పుడే నువ్వు నూటో ముందు, అందరి ముందూ అతనికి

నిన్ను గర్భవతిని చేసే సమర్ధత ఎన్నటికీ లేదని చెప్పావు. అది ఆమె మనసులో బాగా నాటుకుంది. వాడు పోయాక వాడి పిల్లల కోసం నేను జీవించి ఉన్నందుకు పరమాత్మకి నేను సదా కృతజ్ఞురాలిని. ఇప్పుడు నూటో కూడా నీలాగే తయారవుతూంటే ఎందుకు నిందిస్తావు?"

కేథీ అత్త ఇంకో కోలా నట్‌ని నములుతూ మళ్ళీ చెప్పేది కొనసాగించింది.

"ఐతే నువ్వు ఈ శాపపరంపరని ఆపవచ్చని అంటున్నాను. నీకు మళ్ళీ బలం చేకూరాక మీ అమ్మ సమాధి దగ్గరకి వెళ్ళి క్షమాపణ వేడుకో. నువ్వు చేసినదానికి దేవుడి ముందు, సమాధి ముందు విచారం వ్యక్తం చేయి. నా మాట విను."

మా అత్త వెళ్ళాక మా అమ్మ ఏడవసాగింది.

ప్రతీ ఉదయం నిద్రలేవగానే మా అమ్మ నూటో వచ్చిందా అని కిటికీలోంచి మా గదిలోకి చూసేది. ఒంటరిగా ఉన్న నన్ను చూసిన ఆమె కళ్ళల్లో విచారం కనిపించేది. నన్ను నా తల్లి పట్టించుకోవడం లేదని నాకు త్వరలోనే అర్ధమైంది. తనని అంత బాధపెట్టిన నా అక్క నూటో గురించే ఆలోచించేది. ఎక్కడ ఉందా? ఎలా ఉందా? అని ఆలోచించసాగింది.

ఈ విషయం మీద నేను మా అత్తకి మా అమ్మ మీద ఫిర్యాదు చేస్తే, ప్రాడిగల్ సన్(బైబిల్‌లో ఇల్లు వదలి వెళ్ళిపోయిన కొడుకు మీద తండ్రికి గల ప్రేమ గురించిన కథ) కథ చెప్పి ఓదార్చింది.

"నువ్వింకా చిన్నదానివి. త్వరలోనే నీకు తల్లికి పిల్లల మీద గల ప్రేమ అర్ధం అవుతుంది. దొంగైనా సరే. తుచ్ఛులైనా సరే."

ఆ రోజు నించి నేను మా అమ్మ బాధని అర్ధం చేసుకునే ప్రయత్నం చేయసాగాను. మనస్ఫూర్తిగా కాకపోయినా నేను మా అమ్మని సంతోష పెట్టేందుకు ప్రయత్నించేదాన్ని.

మెలొడీ స్టీవెన్ ఆకుపచ్చ మొంబా పాము కాటుతో మరణించాక అమ్మ బాధ అధికమైంది. మెలొడీ పంజరంలో చిక్కుకున్న మొబాని పట్టుకుని దూరంగా తీసుకెళ్ళి విడిచిపెట్టాలనే ప్రయత్నంలో ఉండగా అది అతన్ని కాటేసింది. మా ఇంటి అద్దెని అతనే చెల్లించేవాడు. పెళ్ళయిన అతను ముకుంద గ్రామానికి మళ్ళీ తిరిగి వచ్చిన అమ్మతో సంబంధం పెట్టుకున్నాడు. మా అమ్మ కోసం అతను వచ్చిపోతూండటం నాకు, అక్కకి తెలుసు. అతను తన భార్యని మోసం చేస్తున్నందుకు నాకు కోపంగా ఉండేది. కానీ నూటో మాయమైన రెండు నెలల్లో మా అమ్మ నవ్వింది మెలొడీ ఉన్నప్పుడే. అతని మరణం మా అమ్మని మరింత బాధకి గురిచేసింది. ఐదేళ్ళలో మా అమ్మ పోగొట్టుకున్న మూడో మనిషి అతను. అతను పోయిన కొన్ని రోజుల దాకా భోజనం చేయకుండా ఉపవాసం ఉంది. అందరితోనూ మాట్లాడటం తగ్గించేసింది. నేను మా అత్త కేథీ దగ్గరకి వెళ్ళిపోవాలని అనుకున్నాను. కాని అలా చేసి మా అమ్మని ఇంకా బాధపెట్టద్దని ఆవిడ సలహా ఇచ్చింది.

మెలొడీ మరణించిన ఆరువారాలకి అమ్మ తన పాపాలన్నీ శుద్ధి చేసుకోదలచుకున్నానని, రమ్మని అత్తకి కబురు చేసింది. ఆవిడ వచ్చాక ఓ శనివారం ఉదయం మా అమ్మ నన్ను, కేథీ అత్తని తీసుకుని తన తల్లి సమాధి దగ్గరకి వెళ్ళింది. ఆ

ఇల్లు నేను ఊహించినట్లుగానే ఉంది. ఇంటి గోడల మీద మొలచిన పిచ్చి చెట్లు, లతలు. ఆ ఇంటి పరిసరాలకి వెళ్ళగానే నాకు అంతా చావు వాసన వేస్తున్నట్లుగా అనిపించింది.

అత్త, అమ్మ కలిసి మా అమ్మమ్మ సమాధిని శుభ్రం చేసారు. అమ్మ పాపశుద్ధి కార్యక్రమం మొదలయ్యేలోగా నేను నా చిన్నప్పుడు నేను పెరిగిన ఆ ఇంట్లోని పిల్లల గదిలోకి వెళ్ళాను. నాకు ఓ మూలుగు వినిపించింది. మొదట అది మా అమ్మ మూలుగు అనుకున్నాను. కాని బయట సమాధి ముందు నించి మా అమ్మ మాటలు వినిపించాయి.

"నా ముఖాన్ని పాపాల వైపు నించి తిప్పు. నాకు బలాన్ని ఇవ్వు..."

మళ్ళీ నాకు రెండోసారి ఆ బలహీనమైన మూలుగు వినిపించింది. అది నేనున్న గదిలోంచే. అది దెయ్యం మూలుగేమో అనే భయం క్షణకాలం కలిగింది. కాని దెయ్యం కాదు. తన ప్రియురాలికి ప్రాణాంతక వ్యాధి రావడంతో మా ఇంటికి వచ్చే ధైర్యం చేయలేక అతను అక్కని అక్కడ వదిలేసి వెళ్ళాడు. మాసిన దుస్తుల్లోని మా అక్క నూటో నాకు అక్కడ కనిపించింది. ఆ గదిలో ఆమె చుట్టుపక్కలంతా మలమూత్రాలతో తడిసి దుర్వాసన వేస్తోంది. ఆకుపచ్చరంగుకి తిరిగిన బ్రెడ్ ముక్కలు కూడా కనిపించాయి. అక్కడ ఎంతకాలం నించి ఉందో కాని అదే ఆమెభోజనం అనుకున్నాను. ఆమె ఎన్నో ఊళ్ళు తిరిగిన గుర్తుగా చాలా బస్ టిక్కెట్లు కూడా నాకు అక్కడ కనిపించాయి. ఈ మూడు నెలల్లో ఆమె ఏం కష్టాలు పడిందో కాని అవి ఆమె కాళ్ళు కదలకుండా ఆపేసాయి.

మర్నాడు మేము ఆ ఇంటికి మారాం. రెండురోజుల తర్వాత నేను, మా అమ్మ నూటో మంచం పక్కన కూర్చున్నప్పుడు మాంసంలేని అస్థిపంజరంలా కనిపించే నూటోని చూసి అమ్మ దాని తలని నిమురుతూ ఏడవసాగింది. నూటో మాట్లాడే ప్రయత్నం చేసింది. మాట బాగా బలహీనంగా వినిపించింది. అమ్మ నూటో చేతిని పట్టుకుని చెప్పింది.

"నువ్వేం చెప్పాలని అనుకుంటున్నావో నాకు తెలుసు. క్షమించడానికి ఏమీ లేదు షూ షూ."

బతికున్న రోజుల్లో మా నాన్న తాగి ఇంటికి ఆనందంగా వచ్చినప్పుడు, అన్నం వడ్డించే నూటోని పిలిచే ముద్దుపేరది. ఆ సమయంలో మా నాన్నకి మా అక్క ముద్దు పేరు షూ షూ. నా ముద్దుపేరు కూ కూ.

నూటో మా ఇద్దరి చేతులు పట్టుకుని నన్ను అడిగింది.

"కూ కూ. బయట వాన పడుతూంటే మనం కుంపటి పక్కన కూర్చుని మొక్కజొన్న కండెలని కాల్చుకుని తినే ఆనందకరమైన రోజులు మళ్ళీ వస్తాయా?"

నా గుండెనిండా బాధపొంగినా నేను ఆమెకి ధైర్యాన్ని ఇవ్వాలని ఏడవదలచుకోలేదు.

"నువ్వు బతికే ఉండగా అదేం ప్రశ్న షూ షూ? త్వరలోనే నువ్వు కోలుకుంటావు. రేపు నేను, అమ్మ నిన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్తున్నాం తెలుసా?" జవాబు చెప్పాను.

"నా దగ్గర డబ్బు లేదు. కాని అత్త హాస్పిటల్‌కి డబ్బు ఇస్తానని మాట ఇచ్చింది. నువ్వు త్వరలోనే కోలుకుని మళ్ళీ అందంగా తయారవుతావు. మన ఇంటి వెనక పళ్ళతోటలో నాన్న బతికి ఉన్నప్పటిలా పళ్ళని పండిద్దాం" అక్క చెంపలని నిమురుతూ అమ్మ చెప్పింది.

"సాయంత్రాలు నువ్వు, నేను కేథీ అత్త ఇంటికి వెళ్ళి మియాండో, ఇగుసీ (కేమరూన్ వంటకాలు) చేయడానికి సహాయం చేద్దాం. పాపం. అత్త మనకి చాలాసార్లు సహాయం చేసింది" చెప్పాను.

నూటో బరువుగా నిట్టూర్చి నా చేతిని ఇంకాస్త గట్టిగా పట్టుకుని తెరచిన కిటికీలోంచి కొద్దిసేపు చూసాక చెప్పింది.

"అది నా కల."

మరికాసేపాగి మా అమ్మని అడిగింది.

"అమ్మా! ఆకాశంలో మబ్బుల వెనక దాక్కున్న చంద్రుడు, నక్షత్రాలు కనపడుతున్నాయా?"

"కనిపిస్తున్నాయి షూ షూ. మనిద్దరం  ఒకరి నించి మరొకరం చాలా దూరం వెళ్ళిపోయాం. మనిద్దరం స్త్రీ గౌరవాన్ని పాడు చేసాం."

అమ్మ చెప్పేది నిజమే అన్నట్లుగా చీకట్లోంచి తథాస్తు గుడ్లగూబ అరుపు వినిపించింది. ఇంకొద్దిసేపటికి మబ్బులు తొలిగి చంద్రుడి వెన్నెల కిటికీలోంచి మా మీద పడసాగింది. ఆకాశంలో నక్షత్రాలు స్పష్టంగా కనపడసాగాయి.

**(వచ్చేనెల మరో కథ)**